నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 16 ఏప్రిల్ 2025 | HYDERABAD




పరిపాలన భవనం గేటు ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు



నగరంలోని గచ్చిబౌలిలో మంగళవారం సాయంత్రం వాతావరణం మేఘావృతమై వర్షం పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

### కాంట్రాక్ట్ అధ్యాపకులను

## క్రమబద్ధీకరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీకరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు హెచ్చరించారు. సమ్మె నోటీసును వీసీకి అందజేసేందుకు కాంట్రాక్ట్ అధ్యాపకులు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు. దీంతో పరిపాలన భవనం ప్రధాన గేటు ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇందిరాపార్క్ వద్ద తమ డిమాండ్ల సాధన కొరకు మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. పదిమంది మహిళా అధ్యాపకులు వీసీకి నోటీసు అందజేసేందుకు లోపలికి వెళ్లగా వారిని రాత్రి 7 గంటల వరకు వెయిట్ చేయించి, అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో అధ్యాపక సంఘం నేతలు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరశురాం, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ కుమార్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ ఓ కృష్ణయ్య, డాక్టర్ తిరుపతి, డాక్టర్ పాండయ్య, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ రేష్మా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బల్దియాలో సర్వేల జపం!

**గతంలో జీఐఎస్‌తో అభాసుపాలు**

**తాజాగా డీజీపీఎస్ సర్వేకు శ్రీకారం**

**అంగుళం తేడా రాకుండా చర్యలు**

**ఎల్బీనగర్, కూకట్‌పల్లిలో అమలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ మరో సర్వేకు సన్నద్ధమైనది. 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మహానగరంలో రెసిడెన్షియల్, కమర్షియల్ భవనాలతో కలిపి సుమారు 19 లక్షల 43 వేల నిర్మాణాలు ఉన్నాయని అంచనా వేసిన అధికారులు, ఈ మేరకు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) సర్వే చేస్తున్నది. గతేడాది జూలైలో ఈ జీఐఎస్ సర్వేను ప్రారంభించగా అప్పట్లో ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఏజెన్సీ నిర్లక్ష్యంతో ఈ ప్రక్రియ ఆలస్యమవుతుండగా, మరో ఆరు నెలల సమయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సర్వేకు రూ.22 కోట్ల మేర ఖర్చు చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్న తరుణంలోనే మరో సర్వేకు సిద్ధమయ్యారు. లే అవుట్‌లో ఖాళీ స్థలాలు, పార్కులు, ఆట స్థలాలు, మున్సిపల్ మార్కెట్లు, మున్సిపల్ షాపులు, స్లాటర్ హౌస్‌లు, డంపింగ్ యార్డులు మొదలైన స్థిరాస్తులపై సర్వే చేసేందుకుగాను డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్) తెరపైకి తీసుకువచ్చి సర్వే జరపాలని నిర్ణయించారు.

### 29 వరకు టెండర్ గడువు

ఈ మేరకు ప్రభుత్వ స్థిరాస్తుల సర్వే, డిజిటలీకరణ, జియో రిఫరెన్సింగ్ తదితరమైనవి చేయగల కన్సల్టెంట్ల సేవలను ఆహ్వానిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులకు ఎంపికయ్యే కన్సల్టెన్సీ జీపీఎస్ సర్వే కాకుండా అంగుళం వరకు కూడా కచ్చితమైన వివరాలు అందజేయగల డీజీపీఎస్( డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) సర్వే నిర్వహించనున్నారు. హైదరాబాద్ లోకల్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా ప్రయోగాత్మకంగా కూకట్‌పల్లి, ఎల్బీనగర్ జోనల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో ఈ సర్వే చేపట్టనున్నారు. ఈ నెల 29 వరకు టెండర్ గడువు విధించారు.

### స్థిరాస్తులకు యూనిక్ ఐడీ..

ఇందులో భాగంగానే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నారు. ప్రతి ఆస్తికి సంబంధించిన విస్తీర్ణం, సరిహద్దులు, చుట్టు పక్కల ఉన్న భవనాలు, రోడ్లు, వాటర్, విద్యుత్, సీవరేజీ వంటి యుటిలిటీస్ లైన్లు తదితరమైనవి డీజీపీఎస్‌ను ఉపయోగించి చేయాల్సి ఉంటుంది. ఆస్తికి సంబంధించి ప్రతి మూల రియల్ కో ఆర్డినేట్లు గుర్తిస్తూ అన్ని భవనాల ముందు పక్కల లోపల దృశ్యాలు కనిపించేలా ఫొటోలు తీయనున్నారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన స్థిరరాస్తులన్నింటికీ యూనిక్ ఐడీ నంబరు ఇస్తారు. అంగుళం కూడా తేడా రాకుండా వాటిని కనిపెట్టడంతో పాటు రియల్ టైమ్‌లోనూ వాటిని ఆన్‌లైన్ ద్వారా వీక్షించే సదుపాయం ఉండాలని, భవిష్యత్తులో ఎలాంటి వివాదం తలెత్తకుండా ఈ డేటా ఎంతగానో దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు.

# అటకెక్కిన అమ్మఒడి

**గర్భిణులకు దూరంగా వాహనాలు**

**బీఆర్ఎస్ పాలనలో తల్లిబిడ్డలకు రక్షణ**

**కేసీఆర్ పథకాలను విస్మరిస్తున్న రేవంత్ సర్కార్**

**సొంత వాహనాల్లో దవాఖానలకు గర్భిణులు**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తగ్గుముఖం**

**టార్గెట్లతో ఇబ్బందుల్లో ఆశవర్కర్లు**






సిటీబ్యూరో, ఏప్రిల్15, (నమస్తే తెలంగాణ): స్వరాష్ట్రంలో తల్లిబిడ్డలకు ఏ కష్టం రాకుండా పదేళ్లపాటు రక్షణగా కేసీఆర్ నిలిస్తే.. కాంగ్రెస్ సర్కార్ కనీసం పట్టించుకోవడం లేదు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యాన్ని తుంగలో తొక్కుతూ కాంగ్రెస్ అవలంబిస్తున్న విధానాల కారణంగా తెలంగాణలో గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేసీఆర్ పాలనలో క్షణాల్లో అమ్మ ఒడి వాహనాలు ఇంటి ముందు చేరితే, నేడు ఎన్ని సార్లు ఫోన్ చేసినా అందుబాటులో లేమని సమాధానాలు వినిపిస్తున్నాయి. గతంలో తీరిక లేక తిరిగిన 102 వాహనాలు నేడు రోజులో మూడు ట్రిప్పులతో సరిపెట్టుకుంటున్నారు. వాహనాల జాప్యం కారణంగా సొంత వాహనాల్లోనే ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరోవైపు ఆసుపత్రుల్లో సైతం సరైన పర్యవేక్షణ లేకపోవడం కారణంగా ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు.

### ఒకరిద్దరు ఉంటే రారట..

రాష్ట్రంలోని గర్భిణుల సంరక్షణలో భాగంగా వారికి నాణ్యమైన పరీక్షలు అందించడంతో పాటు ఇంటినుంచి ఆసుపత్రికి, తిరిగి ఇంటికి తీసుకొచ్చే ఆలోచనకు కేసీఆర్ ప్రభుత్వం అమ్మ ఒడికి నాంది పలికింది. రాష్ట్ర వ్యాప్తంగా 2016లో అమ్మ ఒడి పథకంలో భాగంగా 102 వాహనాలను ప్రారంభించారు. గర్భిణులను నాలుగుసార్లు ప్రభుత్వాసుపత్రులకు తీసుకువెళ్లి అవసరమైన పరీక్షలు నిర్వహించి ఇంటిదగ్గర చేర్చడమే లక్ష్యంగా ప్రారంభించారు. ఆశాలు వారికి తోడుగా ఉంటూ ప్రసవం జరిగే వరకు అవసరమైన పరీక్షలు దగ్గరుండి చేయించేవారు. 102 వాహనాన్ని సమన్వయం చేసుకొని గర్భిణులపై జాగ్రత్తలు తీసుకునేవారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 14 వాహనాలు ఉండగా ఒకప్పుడు ఒకరిద్దరు ఉన్నా కూడా ఆసుపత్రికి తీసుకొచ్చేవారు. కానీ నేడు పదిమంది ఉంటేనే వస్తామని, ఒకరిద్దరికీ రామని చెబుతుండటం గమనార్హం.





### అంధకారంలో ఆశాల జీవితాలు..

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయకుండా రేవంత్ సర్కార్ ఆశాల జీవితాలను అంధకారంలోకి నెడుతుంది. బీఆర్ఎస్ పాలనలో తల్లిబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా గర్భిణులకు న్యూట్రిషన్ కిట్, బాలింతలకు కేసీఆర్ కిట్ అందించేవారు. దీంతో నిత్యం ఆసుపత్రుల్లో రద్దీగా కనిపించేది. కానీ కాంగ్రెస్ పాలనలో వాహనాల నిర్లక్ష్యం, కిట్ అమలు చేయకపోవడం వల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తగ్గుముఖం పడుతున్నాయి. టార్గెట్లు ఏమీ లేవని పై అధికారులు ఒకవైపు చెబుతుండగానే, జిల్లా అధికారులు మాత్రం నెలకు నాలుగు ప్రసవాల నమోదు తప్పకుండా ఉండాలంటూ ఆశాలకు ఆదేశాలు జారీచేస్తుండటం గమనార్హం. మరోవైపు కొందరు వైద్యులు నిర్లక్ష్య ధోరణి కారణంగా వచ్చే కేసులు కూడా పక్కనే ఉన్న ప్రైవేట్‌ను వెళ్తున్నాయి.

### సొంత డబ్బులు పెట్టుకుంటున్నాం..

గతంలో అమ్మ ఒడి వాహనంలో ప్రయాణం చేసేవాళ్లం. అమ్మ ఒడి వాహనాల జాప్యం కారణంగా గర్భిణులు తమ సొంత వాహనాల్లో ఆసుపత్రులకు వెళుతున్నారు. మేము మా సొంత డబ్బులతో ఆటోలో ఆసుపత్రులకు వారి వెనుక వెళుతున్నాం. కిట్‌లు లేకపోవడం వల్ల గర్భిణులు నమోదు చేయించుకోవడం లేదు. టార్గెట్లపేరిట ఆశాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.



**-సంతోష, బీఆర్‌టీయూ సంఘం ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## పాలనపై రేవంత్‌కు సోయి లేదు


**బీఆర్ ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలిరండి**

**మాజీ మంత్రి,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

బడంగ్‌పేట్, ఏప్రిల్ 15: ఈనెల 27 న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద బావి మల్లారెడ్డి గార్డెన్‌లో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం రామిడి రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సంవత్సరంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ప్రజల పైన పన్నుల భారం మోపుతున్నారన్నారు. హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం డమాల్ అయిపోయిందన్నారు. రైతులను, కూలీలు, ఏ వ్యాపారిని తట్టిన కన్నీటి పర్యంతం అవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత రేవంత్‌కే దక్కుతుంద న్నారు. రాష్ట్రం ఏమైపోతుందోనని ముఖ్యమంత్రికి సోయిలేదన్నారు. కేసీఆర్ పేరు లేకుండా చేయాలని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుకుంటే అది సాధ్యమయ్యే పని కాదన్నారు. ప్రజల గుండెల్లో కేసీఆర్ సుస్థిరంగా ఉన్నారని తెలిపారు. ఆయన వెంట నడవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రజతోత్సవ సభకు ప్రజలు వెళ్లకుండా పోలీసులు అనేక ఆంక్షలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మాజీ అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు, మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, కందుకూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జయేందర్ ముదిరాజు, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రామిరెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ బీ ఆర్ఎస్ అధ్యక్షుడు లక్ష్మయ్య,, వెంకట్ రెడ్డి, దీప్ లాల్ చౌహాన్, గడ్డి అన్నారం మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, జిల్లా అల్వారు సునీత బాలరాజ్, బీరప్ప, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

### గంగపుత్రుల మద్దతు అభినందనీయం

గోల్నాక, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అంబర్‌పేట గంగపుత్రులు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను పోత్గల్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు కలసి స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలి వస్తామ ని తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల వల్ల గంగపుత్రుల జీవితాల్లో వెలుగులునిండాయన్నా రు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. చెరువుల్లో ప్రభుత్వమే ఉచితంగా చేపపిల్లలను వేసి గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉన్న చెరువులను మత్స్య శాఖకు బదిలీ చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రజతోత్సవ సభకు వివిధ కుల సంఘాలు, ప్రజాసంఘాలు తమ మద్దతు తెలుపడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అంబర్ పేట పోత్గల్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు పెంటం మల్లేశ్, పెంటం మల్లేశం, రాంచందర్, భిక్షపతి, లక్ష్మీపతి, రాజు, పాక రాజు, పరుశురాం, బాల్ రాజ్, సత్యనారాయణ, నర్సయ్య, పెంటం పరశురాం, సంతోష్, శంకర్, కిషన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను కలిసి మద్దతు తెలుపుతున్న పోత్గల్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు

### సమగ్ర నివేదికను

## అందజేయాలి

**అప్రోచ్ రోడ్డు లేకుండా అనుమతి ఎలా ఇచ్చారు?**

**హౌసింగ్‌బోర్డుకు సీఎం కార్యాలయం ఆదేశం**

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేజ్‌లో హౌసింగ్ బోర్డు స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపించి జీహెచ్ఎంసీ నుంచి భారీ భవన నిర్మాణానికి అనుమతి పొందిన అంశం చర్చనీయాంశమైంది. మూసాపేట సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-15లో 'హౌసింగ్ బోర్డు స్థలం నాదే..దరఖాస్తు చేసుకున్న బిల్డర్-అప్రోచ్ రోడ్డు లేకుండా భారీ భవంతికి అనుమతి అన్న శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. ఈ అనుమతులపై వెంటనే పూర్తిస్థాయిలో నివేదికను అందజేయాలని జీహెచ్ఎంసీ, హౌసింగ్ బోర్డు అధికారులకు సీఎంవో కార్యాయల అధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం నుంచి గతంలో అనుమతి పొందిన మూడు భవనాలకు సంబంధించిన పర్మిషన్లపై ఆరా తీశారు. కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం నుంచి పొందిన అనుమతులు నిబంధనల ప్రకారం రద్దు చేయనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. హౌసింగ్ బోర్డు స్థలం అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ పగడాల శిరీష బాబు రావులు స్పందించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



జలమండలి జీఎం సాయిలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నేతలు

## మంచినీళ్లు వస్తలేవు

**అత్తాపూర్‌లో జలమండలికి ఫిర్యాదు చేసిన స్థానికులు**

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 15: తాగునీటి సరఫరాలో అంతరాయం, లోప్రెజర్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖేశ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభంలోనే అరకొర నీటి సరఫరా చేస్తుండడంతో రానున్న రోజుల్లో ప్రజల పరిస్థితి ఎంత దారుణంగా మారనుందో అర్థం అవుతుందన్నారు. ఈ విషయాన్ని లైన్‌మెన్‌లను ప్రశ్నిస్తే తాము చేసేది ఏమి లేదని అంతా పైఅధికారుల సూచనలను పాటిస్తున్నామని చెబుతున్నారన్నారు. అత్తాపూర్ వాసులతో కలిసి జలమండలి జీఎం సాయిలక్ష్మి, డీజీఎం జోహర్‌అలీలను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. అధికారులు బుధవారం ఉదయం అత్తాపూర్‌లో పర్యటించనున్నట్లు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ నాయకులు పుప్పాల లక్ష్మణ్, మల్లేశ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.





ఘట్ కేసర్ లో ఆందోళన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

## స్లాట్ బుకింగ్ వద్దే.. వద్దు

**డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన**

ఘట్ కేసర్, ఏప్రిల్ 15: స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని విరమించుకోవాలని ఘట్ కేసర్ లో మంగళవారం డాక్యుమెంట్ రైటర్లు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానంతో డాక్యుమెంట్ రైటర్లు రోడ్డున పడే దుస్థితి వస్తుందని ఆరోపించారు. ఘట్ కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు దొరకక దస్తావేజు లేఖరు వృత్తిని ఎంచుకొని మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నామని, స్లాట్ బుకింగ్ విధానంతో ప్రతి ఒక్కరూ రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విరమించుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.





నారపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డ్యాక్‌మెంట్ రైటర్లు

### స్లాట్‌తో వినియోగదారులకే ఇబ్బందులు..

పోచారం, ఏప్రిల్ 15: స్లాట్ విధానాన్ని రద్దు చేయాలంటూ నిరసిస్తూ పోచారం మున్సిపాలిటీ నారపల్లి సబ్‌రిజి స్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యు మెంట్ రైటర్లు మంగళవారం ఆందోళన చేశారు. ఉదయం నుంచే దస్తావేజుల తయారీ పనులను నిలిపివేశారు. ప్రభుత్వం స్లాట్ విధానాన్ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తీసుకు వస్తున్న ఈ విధానంతో వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకునే వరకు తమ నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు రంగ నరేందర్ గౌడ్, శ్రీనివాస్, హరికృష్ణ గౌడ్, మధుసూదన్‌రెడ్డి,బాలకృష్ణ,మధుకర్‌రెడ్డి,సురేశ్, వినోద్ కుమార్,శ్రీహిత్‌శర్మ,బాలు,రవి నాయక్,భాస్కర్, కళ్యాణ్,సైదులు,శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న దస్తావేజులేఖరులు

### నేటి నుంచి పనులు చేయొద్దని తీర్మానం

మేడ్చల్, ఏప్రిల్ 15 : ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన స్లాట్‌బుకింగ్ విధానంపై నిరసిస్తూ దస్తావేజు లేఖరులు మంగళవారం ఆందోళన చేశారు. బుధవారం సహాయ నిరాకరణకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 16 నుంచి 21 వరకు దస్తావేజు పనులు చేయవద్దని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖరులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన విధానంలో ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇటు దస్తావేజు లేఖరులు, రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, అటు ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. రిజిస్ట్రేషన్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని, పూర్తి స్థాయిలో ఆప్షన్‌లు లేకుండానే ఆన్‌లైన్ బుకింగ్ విధానం తీసుకువచ్చారన్నారు. కొత్తగా వచ్చే విధానాలు సరళీకృతంగా ఉండాలని కానీ సమస్యలు తెచ్చిపెట్టేలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయంపై పునరాలోచన చేసి, ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్‌ను రద్దు చేయాల డిమాండ్ చేశారు.

### పాత పద్ధతినే కొనసాగించాలి..

శంషాబా రూరల్, ఏప్రిల్ 15: స్లాట్ బుకింగ్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. పాతపద్ధతినే కొనసాగించాలని కోరుతూ మంగళవారం డాక్యుమెంట్ రైటర్లు శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత పద్ధతిలో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉండేదని, స్లాట్ బుకింగ్‌తో ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిపై దెబ్బపడుతుందని అన్నారు. ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. అనంతరం శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు సుధాకర్, బాల్‌రెడ్డి,హేమంత్‌రెడ్డి, శ్రీనివాస్, రవి, రాజు, శ్రీనివాస్, నరేశ్, కరుణాకర్‌రెడ్డి, హరి, మాజిద్, షరీఫ్, వినయ్‌రెడ్డి, ప్రకాశ్, శ్రీశైలం, భాస్కర్, శ్రీను, సిద్ధు, ప్రవీణ్, వహెద్ తదితరులు పాల్గొన్నారు.



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

### జీతాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 15: జీతాలు చెల్లించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవ్వాల, రేపు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారని, వెంటనే జీతాలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 200 మంది కార్మికులు పాల్గొన్నారు.